# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

26-03-2025 బుధవారం పేజీలు 4 www.manabalagam.com




# పరామర్శకు నోచుకోని అన్నదాత

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 25 (మన బలగం):** అరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షం, వడగళ్ల వానతో నష్టపోతే ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోగా చివరకు మంత్రుల పరామర్శ అన్నదాతలకు కరువైందని బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎల్.రమణ నివాసంలో జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్ కలిసి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షా లు, వడగండ్ల వానలతో రైతులు తీవ్రంగా నష్టపోతే ఏఒక్క మంత్రి కూడా

మిగతా 3 లో



# కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

మంత్రి పదవిపై పలువురి ఆశలు

మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు

**హైదరాబాద్, మార్చి 25 :** ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహుర్తం దగ్గరపడిరది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడిరది. అయితే కేబినెట్ లో రెండు బెర్త్ లను పెండింగ్ లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్లో

మిగతా 2 లో

# మరో మృతదేహం లభ్యం

ఎస్ఎల్ బీసీ ఘటనలో గత నెల 22న ప్రమాదం



**మహబూబ్ నగర్, మార్చి25:** ఎస్ఎల్ బీసీ టన్నెల్ లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళ్లు వారి

మిగతా 2 లో

# బట్టలు విప్పడు.. కత్తులు దూసుడు

అసెంబ్లీ సమావేశాలపై మల్లారెడ్డి వ్యాఖ్యలు

..3 లో



# అది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వాలి

## ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్



ఇబ్రహీంపట్నం, మార్చి 25 (మన బలగం): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ అన్నారు. మంగళవారం దేవేందర్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి శ్రమించి ప్రభుత్వం ఏర్పాటులో ఆది శ్రీనివాస్ పాత్ర ఎంతో ఉందన్నారు. బీసీ నాయకుడిగా 30 సవత్సరాల నుంచి ప్రజలలో తిరిగి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, అలాంటి వ్యక్తికి మంత్రివర్గంలో చోటు ఇస్తే బీసీలకు గౌరవం లభిస్తుందన్నారు. అధిష్టానం పునరాలోచన చేసి ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

# నవోదయకు విద్యార్థుల ఎంపిక



ఇబ్రహీంపట్నం, మార్చి 25 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామనికి చెందిన తరి లవన్, జంబుక అకృతి, బర్మ అక్షిత్ అనే విద్యార్థులు నవోదయ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. వేములకుర్తిలోని న్యూవిజన్ కాన్వెంట్ స్కూల్‌లో చదువుతున్న తరి లవన్‌తో పాటు అకృతి, అక్షిత్ ఇదే పాఠశాలలో చదివిన పుర్వ విద్యార్థులు కాగా నవోదయకు ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కరస్పాండెంట్ గుమ్మల తిరుపతి, పలువురు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన బిడ్డకు నవోదయ సీటు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 25 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి నవోదయ పరీక్ష ఫలితాల్లో మారుమూల గర్జనపల్లి తండా పాఠశాల విద్యార్థిని శ్రీనిత రాథోడ్ 6వ తరగతికి ఎంపిక అయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి జాదవ్ తెలిపారు. శ్రీనిత తండ్రి గణపతి ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లగా, తల్లి లలిత ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేస్తూ కూతుర్ని చదివిస్తోందని అన్నారు. కాగా ఉపాధ్యాయుల కృషి వల్లే తమ కూతురికు సీటు లభించిందని తల్లి లలిత తెలిపింది. శ్రీనితను మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కావేరి, రజిత దేవి, సుమలత, వినీత, విద్యా కమిటీ చైర్మన్ లావణ్య, తల్లిదండ్రులు అభినందించారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

రాజన్న జిల్లా ప్రతినిధి, మార్చి 25 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో మజీద్‌లో ప్రభుత్వపరంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. సర్వ మతాలకు నిలయం భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రమని ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడివో వాజిద్ అబ్దుల్, ఎస్సై ఎల్లా గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.




# కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండిరగ్ లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది. ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అలెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్ లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్ బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్ లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్ లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్ లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం–అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్ లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.

# తాగానని పట్టుకొంటావా

## మూడోకన్ను మూసేస్తా..
## సీసీ కెమెరాల వైర్లు తెంపించి
## కేసుల పాలైన ఉద్యోగులు
## జగిత్యాలలో జోరుగా చర్చ




జగిత్యాల ప్రతినిధి, మార్చి 25 (మన బలగం): మున్సిపల్ ఉద్యోగి మందు పార్టీలో ఎంజాయ్ చేసి ఇంటి దారి పట్టాడంట. అదే దారిలో ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు. ఇంకేముంది ఆ ఉద్యోగి పట్టుబడ్డాడట. పోలీసులు యథావిధిగా తమ డ్యూటీలో ఉండిపోయారు. తాను మున్సిపల్ ఉద్యోగిని అంటూ చెప్పుకొచ్చాడంట. పోలీసులు ఎవరైతే మాకేంది అంటూ రూల్స్‌కు పోయారు. తిక్క రేగిన ఆ మున్సిపల్ ఉద్యోగి నేనెంది.. నా లెవలేంది అంటూ లోలోన మండి పోయుంటాడు. పోలీసులకు గట్టి వాత పెట్టాలని అనుకొన్నాడేమో.. అదే పనిగా ఆలోచిస్తే మున్సిపల్ స్తంబాలకు సీసీ కెమెరాలను పెట్టారు. ఆ వైర్లను తెంపేస్తే పోలీసుల మూడోకన్ను మూతపడుతుంది అని అనుకున్నాడు. ఇక పోలీసులు దిగొచ్చుడే అనుకొని పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పాత బస్టాండ్, లడ్డు ఖాజా, బాలాజీ థియేటర్, న్యూ బస్టాండ్, ఆర్డీవో చౌరస్తా, తీన్ ఖని, మంచినీళ్ల బావి వంటి కీలక ప్రాంతాల్లోని సీసీ కెమెరాల కేబుల్ వైర్లను సిబ్బందితో కట్ చేయించాడంట ఆ మున్సిపల్ ఉద్యోగి. ఒక్కసారిగా పోలీస్ స్టేషన్లలోని సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయి. ఎందుకు ఇలా జరిగిందని పోలీసులు ఆరా తీస్తే వాస్తవం వెలుగు చూసింది. మున్సిపల్ ఎలక్ట్రికల్ అధికారి ఆదేశాలతో సిబ్బంది సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారన్న ముచ్చట. దీంతో పోలీసులు ప్రభుత్వ ఆస్తి నష్టం, ప్రజా రక్షణ వ్యవస్థకు ఆటంకం వంటి కోణాల్లో ఆదేశించిన అధికారి, ఆచరించిన ఉద్యోగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల పట్టణ ప్రజల అదృష్టం బాగుండి దొంగలకు సీసీ కెమెరాలు పనిచేస్తలేవన్న ముచ్చట ఎరుకైతే ఇంకెన్ని దొంగతనాలు జరిగేవోనన్న చర్చ ప్రజల్లో సాగుతోంది. జనసంచారం వున్నపుడే చూస్తుండగానే వాహనాలను ఎత్తుకెళ్లుతున్న సంఘటనలు రోజు జగిత్యాలలో చోటు చేసుకొంటున్న విషయం అందరికి తెలిసిందే. అసలే ఎండాకాలం ఒకరాత్రే పోలీసుల మూడోకన్ను మూతపడితే ఎలా ఉంటుందో ఉహిస్తేనే జల్లుమంటోందని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

# ఏకలవ్య మోడల్ పాఠశాలను సందర్శించిన విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 25 (మన బలగం): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో పీఎం శ్రీ మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 వ తరగతి విద్యార్థులు 'ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల మర్రిమడ్ల'ను సందర్శించారు. మరిమడ్ల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తమ పాఠశాల సంస్కృతి, విద్యావ్యవస్థలను పరిచయం చేశారు. అలాగే ఆ పాఠశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులు, రిటైల్ ల్యాబ్, ప్రయోగశాల, గ్రంథాలయం–మ్యూజిక్ రూమ్, ఓమ్, ఆటమైదానం మొదలగు వాటిని పరిశీలించారు. ఈ సందర్భన రెండు పాఠశాలల మధ్య మిత్రత్వాన్ని పెంపొందించడమే కాక, విద్యార్థులు ఎన్నో నూతన విషయాలను నేర్చుకోవడానికి, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి దోహదపడింది. ఈ పర్యటన ఉపాధ్యాయులకు మరియు విద్యార్థులకు చాలా గొప్ప అనుభవాన్ని మరియు సామాజిక నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం కల్పించింది. కార్యక్రమంలో మరిమడ్ల ప్రిన్సిపల్ రామ్ సూరత్ యాదవ్, పీఎం శ్రీ ఎంపీపీ ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉదయలక్ష్మి మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# మరో మృతదేహం లభ్యం

మొదటి పేజీ తరువాయి

ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్ లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్ కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. రెస్క్యూ బృందాలు దుర్వాసన వస్తుండడంతో స్ప్రే బాటిల్స్ తీసుకొని లోపలికి వెళ్లారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి టిబిఎం మిషన్ పరికరాలు గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించడం, మృతదేహం చుట్టూ భారీగా పేరుకుపోయిన శకలాలు, మట్టి బురద తొలగించడం లాంటి సహాయక చర్యలు వేగవంతం చేసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడిని ఉత్తరప్రదేశ్ కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్ కుమార్ గా గుర్తించారు. అనంతరం డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం డెడ్ బాడీని మనోజ్ కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## నవోదయ సీటు సాధించిన బుడతడు



ఇబ్రహీంపట్నం, మార్చి 25 (మన బలగం) : చొప్పదండి నవోదయ విద్యాలయ సమితి మంగళవారం విడుదల చేసిన 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన బుడతడు ప్రతిభ చూపాడు. మండల కేంద్రానికి చెందిన దాసరి ఉమ-వెంకటేశ్ ల పెద్ద కొడుకు దాసరి యశ్వంత్ వర్ధన్ 6వ తరగతిలో సీటు సాధించాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థి నవోదయలో సీటు సాధించడంపై పలువురు అభినందిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 25 (మన బలగం): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ తరలివెళ్లకుండా వీవోఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 20 వేల వేతనం ఇవ్వాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు పద్మ, రాధ, జయశీల, మాధవి, విజయ, స్వప్న, స్వప్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాదాలపై జీఎస్టీ ఎత్తివేత

### పార్లమెంటు వర్షా కాల సమావేశాల్లో ఐటీ బిల్లు

న్యూఢిల్లీ, మార్చి25: కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చకు చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలకు నిర్మలా సీతారామన్ సమాధానంఇస్తూ, ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని తెలియజేశారు. సెలెక్ట్ కమిటీ– తన నివేదికను పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటి రోజు సమర్పించవలసి ఉంది. 'మేము దానిని వర్షాకాల సమావేశాల్లో చేపడతామని మంత్రి తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో మొదలై ఆగస్టు వరకు సాగుతుంటాయి. కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఆమోదం పొందిన తరువాత డిజిటల్ రికార్డును కూడా మదింపునకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు– సీతారామన్ చెప్పారు. 1961 చట్టంలో డిజిటల్ ప్రస్తావన లేనందున అది తరచు వివాదాస్పదం అవుతోందని, జనం కోర్టును ఆశ్రయించి, పాస్‌కోడ్‌ను పంచుకోకుండా రక్షణ కోరుతున్నారని ఆమె తెలిపాను. 'అందువల్ల డిజిటల్ ఒక వివాదంగా మారుతోంది. ఇప్పుడు ఉన్న ఆ లోటును కొత్త ఆదాయపు పన్ను బిల్లులో భర్తీ చేస్తున్నాం. బిల్లు సెలెక్ట్ కమిటీ– ముందు ఉందని ఆమె చెప్పారు. తనిఖీ, స్వాధీనం కేసుల్లో ఆన్‌లైన్ ట్రేడిరగ్, పెట్టుబడి ఖతాలు సహా వర్చువల్ డిజిటల్ స్పేస్, కంప్యూటర్ సిస్టమ్‌ల అందుబాటు– కోడ్‌ను అధిగమించే అధికారాలను పన్ను అధికారులకు కొత్త బిల్లు దత్తం చేస్తుంది. 1961 ఆదాయపు పన్ను చట్టం పరిమాణంలో సగం ఉన్న సరళీకృత ఆదాయపు పన్ను బిల్లు దావా అవకాశాన్ని, కొత్త అన్వయాన్ని కనిష్ఠ స్థాయికి చేర్చడం ద్వారా పన్నును కచ్చితత్వం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ ఇంతకు ముందు తెలియజేసింది. తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలాసీతారామన్ వివరించారు. వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడిరచారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిసితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# పరామర్శకు నోచుకోని అన్నదాత

మొదటి పేజీ తరువాయి

రైతుల దగ్గరకు వెళ్లి పరామర్శించి భరోసా కల్పించలేదని మండిపడ్డారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో మాట్లాడితే దాటవేసే ధోరణిలో ఉన్నారే తప్ప సమాధానం ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు విపరీతంగా పెరిగాయని, కాంగ్రెస్ 16 నెలల పాలనలో 1లక్ష 58 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని అన్నారు. భారతదేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇంత స్వల్పకాలంలో ఈ స్థాయిలో అప్పులు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూ ఉందన్నారు. 2 లక్షల రైతు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని, ఏ గ్రామానికి వెళ్లినా రుణమాఫీ జరగలేదని చాలా మంది రైతులు చెబుతున్నారని, ప్రభుత్వం మాత్రం అందరికి ఇచ్చామని చేతులు ఎత్తేసినట్లు కనబడుతుందన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు వెళ్లి పరిశీలిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ఏ ఒక్కరు రైతుల దగ్గరకు వెళ్లడం లేదన్నారు. అసమర్థత వల్ల సాగునీరు సరిగ్గా అందక, విద్యుత్తు సరిగా లేకా లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయాయన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. వడగండ్ల వాన వల్ల పంట నష్టం జరిగిందని రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతుబంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సహాయం చేశాడని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని అన్నారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని గ్రామాన్ని కేంద్రంగా తీసుకొని సక్రమంగా అమలు చేయాలని కోరారు. హైదరాబాదులోని ఎంఎంటీఎస్ హత్యాచార ఘటన చాలా దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించడం కాదు మహిళలకు భద్రత కల్పించాలని అన్నారు. కేసీఆర్ హయాంలో షీటీంలతో రాష్ట్ర మహిళలకు భద్రత కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిన్న శాసనమండలిలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతుండగా మైక్‌కట్ చేయడమే మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న దానికి నిదర్శనమని వసంత అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బట్టలు విప్పుడు.. కత్తులు దూసుడు

హైదరాబాద్,మార్చి25: మాజీ మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడటం ఆయన నైజాం. ఆయన పలు విచిత్రంగా స్టేజీలమీద, విలేకరుల సమావేశాల్లో పలు కామెంట్లు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలమీద మంగళవారం కామెంట్ చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంగళవారం అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి పలుకరింపులు ఆసక్తిగా మారాయి.

### స్పీకర్ ప్రసాద్ కుమార్ వ్యాఖ్యలు బాధ కలిగించాయి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడాను తప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ''సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుందని తెలిపారు. నిన్న మీరు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చానన్నారు. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా.. నాకే వినబుద్ధి అవడలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధకలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదని.. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ.. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతానని తెలిపారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. తాను తప్పేం మాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగా లేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మానంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు' అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలంటే తనకు ఎనేలని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. 'మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపులా నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నదన్నారు. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదని తెలిపారు. మీకు వినబడుతున్నదా అనీ అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను.' అని చెప్పారు.

### ఓయూ ఆంక్షలపై చర్చించండి.. బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలపై అసెంబ్లీలో చర్చించాలంటూ బీఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. దీనిపై శాసనసభలో చర్చించాలని ప్రతిపాదించింది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శికి వాయిదా తీర్మానం అందించింది. ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పోరాటాలకు ఊపిరిలూదిన విద్యార్థిలోకంపై కక్షగట్టింది. ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో ఆందోళనలపై ఈ నెల 15న నిషేధం విధించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారులపై ఆనాటి పాలకులు ఊరూరా ఉక్కుపాదం మోపుతున్న తరుణంలోనూ ఓయూ విద్యార్థి ఉద్యమంపై ఎలాంటి నిషేధాజ్ఞలు విధించలేదు. కానీ, నేడు 'ప్రతికూల ప్రభావం' అంటూ సాకుగా చూపి రేవంత్ సర్కారు అణచివేత చర్యలకు దిగింది. వర్సిటీలో అన్నిరకాల ధర్నాలు, నిరసన ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ శనివారం ఓయూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత ఉస్మానియాపై ఇలాంటి నిషేధాజ్ఞలు విధించడం విపరిణామమే. వర్సిటీ అధికారుల ఈ నిర్ణయంపై విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, దాని విభాగాలు, కళాశాలలు, కేంద్రాలు, పరిపాలనా భవనాల్లో ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు నిషేధిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి ఈ సర్క్యులర్ జారీ చేశారు. నిరసనలు యూనివర్సిటీ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు పరిపాలన, విద్యా పురోగతిని జాప్యంచేసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో భద్రతా సమస్యలు సైతం తలెత్తాయని తెలిపారు.

వర్సిటీ భవనాల్లోకి అనధికారికంగా ప్రవేశించడం, ధర్నాలు, ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిరోధించడం, వర్సిటీ ఉద్యోగులు, అధికారులపై అభ్యంతరకరమైన భాషను వినియోగిస్తూ దూషించడాన్ని సంపూర్ణంగా నిషేధించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఏదైనా ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించడం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.